క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



లోక ప్రవీణ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జైనథ్: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి మండలంలోని కంఠ గ్రామంలోని రామాలయ నిర్మాణం కోసం రూ. 1 లక్షల విరాళం అందజేశారు. ఆదివారం రామాలయంలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఆయన్ను పూలమాల, శాలువాలతో సన్మానించారు.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: పేదల ఆకలి తీర్చడం కోసమే అన్నదాన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని సుధీర్ కుమార్ సంగెం అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో అన్నదానం నిర్వహించారు. ఉపాధ్యాయుడు అంబయ్య ముఖ్య అతిథిగా హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, రాజయ్య, శేఖర్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ అధ్యక్షుడిగా పవన్ నాయక్



పవన్ నాయక్

ఆదిలాబాద్‌టౌన్: శ్రీరమా సహిత సత్యనారాయణ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా జాదవ్ పవన్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాదవ్ పవన్ నాయక్, ఉపాధ్యక్షుడిగా విజయ రావు, శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కర్ల రాములు, కార్యదర్శిగా రాథోడ్ ప్రకాష్, మనోజ్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, కోశాధికారిగా భగవంత్ రావులను ఎన్నుకున్నారు. కాలనీవాసులు తనపై నమ్మకంతో మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నిక చేయడం సంతోషంగా ఉందన్నారు. అందరి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

కంఠ రామాలయంలో ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యేకు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న గ్రామస్తులు

జైనథ్: మండలంలోని కంఠ గ్రామంలోని రామాలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తులు, స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు విరాళాలు సేకరించి, రామాలయం నిర్మించడం అభినందనీయమన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని, ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలన్నారు.

ముదిరాజ్ సంఘం అభివృద్ధికి కృషి

తలమడుగు: మండలంలోని ముదిరాజ్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ సంఘాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు నావంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలోనాయకులు ప్రకాష్ రావు, బైండ్ల గణేష్, దొంతుల ఇస్తారి, రమకాంత్, ప్రవీణ్ రెడ్డి, సాంబశివ, పోశెట్టి, రామన్న, అశోక్, గంగారెడ్డి పాల్గొన్నారు.

'ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలి'

నేరడిగొండ: బోథ్ మండలంలోని కన్నుగట్ల గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రుక్మాన్‌సింగ్, సురేందర్ యాదవ్, సొసైటీ డైరెక్టర్ నారాయణ, బీసీసెల్ అధ్యక్షుడు బుచ్చన్న, సయ్యద్, నరేందర్, సత్యనారాయణ, మునేశ్వర్ పాల్గొన్నారు.

నేడు తుడుందెబ్బ సమావేశం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఆదివాసీనగర్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు తుడుందెబ్బ జిల్లా అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కడప నగేశ్ తెలిపారు. తుడుందెబ్బ అనుబంధ సంఘాలు, రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల బాధ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కూల్.. కూల్‌గా..

- పట్టణంలో వెలిసిన జ్యూస్‌సెంటర్లు, ఐస్‌క్రీం పార్లర్లు
- ఎండ నుంచి ఉపశమనం పొందుతున్న ప్రజలు
- పెరిగిన విక్రయాలు



జ్యూస్ తయారు చేస్తున్న యువకుడు

కైలాస్‌నగర్: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పగటి పూట 43 డిగ్రీలుగా నమోదవుతోంది. ఉదయం 11దాటితే చాలు జనం ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. తప్పనిసరి బయటకు వెళ్లాల్సి వస్తే భానుడి ప్రతాపాన్ని ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. పదేపదే నీళ్లు తాగిన దాహార్తి తీరడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాల వైపు ఆసక్తి చూపుతున్నారు. కూల్‌డ్రింక్స్‌కు బదులుగా పండ్ల రసాలు, చెరుకు జ్యూస్‌పై మక్కువ కనబరుస్తున్నారు. జ్యూస్ సెంటర్లు, ఐస్‌క్రీం పార్లర్లు జనాలతో సందడిగా మారుతున్నాయి. డిమాండ్ కనుగుణంగానే జ్యూస్ సెంటర్లు విరివిగా వెలిశాయి. పట్టణంలో ప్రధానంగా బస్టాండ్ ప్రాంతంతో పాటు కలెక్టర్‌చౌక్, స్టేడియం, పార్కురోడ్, ఎన్టీఆర్ చౌక్ ప్రాంతాల్లో ఎక్కువగా జ్యూస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ద్రాక్ష, కర్బూజ, ఆపిల్, ఆరెంజ్, మామిడి, పైనాపిల్ పండ్ల రసాలతో పాటు ఫ్రూట్ సలాడ్, లస్సీని విక్రయిస్తున్నారు. ఆయా రకాల జ్యూస్‌లను రూ.30 నుంచి రూ.120వరకు విక్రయిస్తున్నారు. ఐస్‌క్రీంలను ఫ్లేవర్ల ప్రకారంగా రూ.120 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. ధరలు అందుబాటులో ఉండడంతో ఎండల నుంచి ఉపశమనం పొందుతున్నారు.

విక్రయాలు పెరిగాయి

గత నెల రోజుల కిందట జ్యూస్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో జ్యూస్‌లను తాగేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. వాటి విక్రయాలు సైతం జోరందుకున్నాయి. అన్నిరకాల పండ్ల జ్యూస్‌లను అందుబాటులో ఉంచాం.

– అక్రం, జ్యూస్ సెంటర్ నిర్వాహకుడు

వ్యాపారం బాగుంది

ప్రతీఏటా వేసవిలో జ్యూస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం. ఎండల తీవ్రత పెరిగే కొద్ది తమ షాపుకు ప్రజల రద్దీ పెరుగుతుంది. వివిధ రకాల పండ్ల రసాలతో పాటు డ్రైఫ్రూట్స్‌తో కూడిన ఐస్ క్రీంను విక్రయిస్తాం. ప్రస్తుతం వ్యాపారం బాగుంది.

– ఆర్మన్, జ్యూస్ సెంటర్ నిర్వాహకుడు



జ్యూస్ అందజేస్తున్న యువకుడు



వివిధ రకాల జ్యూస్‌లు



ఐస్‌క్రీం పార్లర్‌లో జనాల సందడి

సభ ఏర్పాట్లను పరిశీలించిన 'కంది'

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో నిరనిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి కోరారు. బహిరంగ సభ ఏర్పాట్లను ఆదివారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. పనులు చేస్తున్న వారికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, నాయకులు రషీద్, ప్రశాంత్ రెడ్డి ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కంది శ్రీనివాస రెడ్డి

జయప్రదం చేయండి

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో సోమవారం నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను పట్టణ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు జయప్రదం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్ కోరారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలన్నారు.

నార్నూర్: సీఎం సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని సీనియర్ నాయకుడు బానోత్ గజనంద్ నాయక్, నాయకులతో సమీక్ష నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవరవ్ లోకండే, మాజీ జెడ్పీటీసీ బిర్జులాల్, కోఆప్షన్ మెంబర్ షేక్ దస్తగిర్, పీఏసీఎస్ డైరెక్టర్ దుర్గే కాంతారావు, దాదే అలీ, నర్సింగ్ మొరే, కరీం ఖాన్, మహేందర్, యూసుఫ్‌ఖాన్ పాల్గొన్నారు .

ఘనంగా బీరప్ప పండుగ

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో ఆదివారం బీరప్ప పండుగను ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి నుంచి బీరప్ప దేవుడిని కురుమ కులస్తులు గ్రామానికి తీసుకురాగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ప్రతీ మూడేళ్లకొసారి బీరప్ప దేవుడు గ్రామానికి రాగా పూజలు నిర్వహించి పండుగ జరుపుకుంటామని కులస్తులు తెలిపారు. కార్యక్రమంలో కులస్తులు సదానంద్, గట్టు వెంకట్రావ్, గంగన్న, రాజన్న పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కురుమ కులస్తులు

విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని మావల శివారు ప్రాంతంలో గ్రీన్ వ్యాలీలో ఈనెల 18న ప్రారంభమైన శ్రీశక్తి దుర్గామాత ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక పూజలరు చేసి వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆలయాన్ని నిర్మించుకొని విగ్రహ ప్రతిష్ఠాపన జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు రేణుక సంజీవ్ కుమార్, రమేశ్, శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఎండ రక్షణకు పరదా





తాంసి: ఎండలు దంచికొట్టడంతో వ్యవసాయ కూలీలు ఎండ నుంచి రక్షణ పొందేందుకు వినూత్న ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మండలంలోని వడ్డాడి శివారులో వేరుశనగ పంట తీస్తున్న మహారాష్ట్రకు చెందిన కూలీలు ఎండ తగలకుండా పరదాలు, చుట్టూ చీరలు ఏర్పాటు చేసుకొని పనులు చేస్తున్నారు.

అంబేద్కర్ జయంతి విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి: ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్‌లో ఈనెల 24న నిర్వహించే అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రబుద్ధనగర్ సామ్రాట్ అశోక్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ మెమోరియాల్ అసోసియేషన్ మండల కమిటీ సభ్యులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రమణ, గాయక్‌వాడ్ భరత్, బాలాజీ, న్యానోబా పాల్గొన్నారు.

రెండు సహాయ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ఇచ్చోడ: మండలంలో నూతనంగా రెండు సహాయ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సహాయ ఎన్నికల అధికారి తహసీల్దార్ తుకారాం ఆదివారం తెలిపారు. పోలింగ్ కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గాయిద్‌పల్లి, జోగిపేట్ గ్రామాల్లోని పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కోసం వారి గ్రామాల్లోనే ఓటుహక్కును వినియోగించుకోవడానికి ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించినట్లు తెలిపారు.

బీజేపీ నాయకుల ప్రచారం

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి, ప్రధాని మోదీకి గిఫ్ట్‌గా ఇద్దామని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. ఆదివారం తిమ్మాపూర్, లక్ష్మీపూర్, పీచరా, గోవింద్ పూర్, నాగమల్యాల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గల్లీలో ఎవరున్నా.. ఢిల్లీలో మాత్రం మోదీయే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, మాజీ ఎంపీపీ ఆత్రం జ్ఞానసుధ, శక్తి కేంద్ర ఇన్‌చార్జి గట్టు నారాయణ, ప్రధాన కార్యదర్శులు బంటు ప్రవీణ్, ధర్మపురి రాఘవులు, బాక్రే లక్ష్మణ్, బైరి రాజేందర్, అర్క గంగారాం, చిట్టడి గంగాధర్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

కైలాస్‌నగర్: నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ అర్బన్ మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని క్రాంతినగర్, సీసీఐ లేబర్ కాలనీలో పర్యటించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా తీరును పరిశీలించడంతో పాటు కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. క్రాంతినగర్‌లో రెండు చేతిపంపులు చెడిపోయి నీటికోసం ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే వాటికి మరమ్మతులు చేయించారు. కాలనీలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షంవ్యక్తం చేశారు.

చిన్నుగూడలో నీటిగోస



బావి నుంచి నీటిని తోడుతున్న ఆదివాసీలు

- గ్రామస్తులకు చెలిమ నీరే దిక్కు
- తప్పని తాగునీటి తిప్పలు
- సమస్య పరిష్కరించాలని గిరిజనుల వేడుకోలు



నీటిని తీసుకెళ్తున్న మహిళలు



గ్రామస్తులు తాగే మురికి నీరు ఇదే

ఉట్నూర్‌రూరల్: గుక్కెడు నీటి కోసం గిరిజన గ్రామాలు అల్లాడుతున్నాయి. ఏన్నాడు లేని విధంగా ఎండలు దంచికొడుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వాలు తాగునీటి పథకాలకు కోట్లు వెచ్చిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. మారుమూల గిరిజన గ్రామాల ఆదివాసీలు వేసవి వస్తే నీటి గోస తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉట్నూర్ మండంలోని చిన్నుగూడ గ్రామంలో ప్రస్తుతం నీటిఎద్దడి ఏర్పడింది. గ్రామంలో తొమ్మిది ఇళ్లు, 20 మంది జనాభా ఉన్నారు. గ్రామంలో ఒకే చేతిపంపు ఉంది. అది కూడా గంటపాటు కొడితే రెండు బిందెల నీళ్లు మాత్రమే వస్తాయని గిరిజనులు వాపోతున్నారు. గ్రామ పొలిమేరలో గత 15 రోజుల క్రితం ఊరంతా కలిసి రెండు మూడు చోట్ల చెలిమెలు తవ్వారు. చిన్నపాటి బావిలా తయారు చేసి, దాని నుంచే వచ్చే బురద నీటినే తాగుతున్నారు. చిన్నుగూడ చుట్టూ పక్కల గ్రామాలైన సోనేరావుగూడ, భీంజీగూడలో సైతం నీటి సమస్యల నెలకొంది. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలో బోరు వేయించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి



గ్రామంలో కనీస సౌకర్యాలు లేవు. ప్రస్తుతం నీటి సమస్య తీవ్రంగా ఉంది. సార్లు నీళ్ల సమస్యను పరిష్కరించాలి . గ్రామం ఒకే చేతిపంపు ఉంది. రెండు బిందెల నీరు కూడా రావడం లేదు. మే నెలలో నీరు దొరికే అవకాశం లేదు. ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు సమస్య తీర్చాలి.

– కాశీరాం, చిన్నుగూడ గ్రామస్తుడు

బురద నీరే తాగుతున్నాం



ఊరిలో ఉన్న చేతిపంపు నీరు అడుగంటుతోంది. ఊరి పొలిమేరలో గ్రామస్తులంతా కలిసి బావి లాగా చెలిమ ఏర్పాటు చేసుకున్నాం. అందరం కలిసి అక్కడి నుంచి నీటిని మోస్తున్నాం. చేతిపంపు నీరు సరిపోక బురదనీరే తాగుతున్నాం.. సార్లు ఎవరూ వచ్చి మా సమస్యలు చూడటం లేదు.. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

– ఆత్రం మోతుబాయి, గ్రామస్తురాలు

ఆదివాసీ ఆడబిడ్డను ఆదరించండి

బేల: పార్లమెంటు ఎన్నికల్లో ఆదివాసీ ఆడబిడ్డ ఆత్రం సుగుణను ఆదరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్ కోరారు. ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో మండలంలోని చంపెల్లి, భవానీగూడ(సి) గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్ల పాలనలో పేదలకు చేసేందేమి లేదన్నారు. కేవలం హామీలతో కాలం వెళ్లదీస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు సవాపురే విలాస్, అశోక్‌రెడ్డి, దొటే అనిల్, దడంజే బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

నేరడిగొండ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకుడు ఆత్రం భాస్కర్ అన్నారు. ఆదివారం బోథ్ మండలంలోని నాగపూర్, జైనురు పల్లె, నిగిని, కంటేగాం , బాబేర, నేరేడుపల్లె, చింతగూడ, గురుదేవ్ నగర్, జీడిపల్లి, డివిటి, పరుపులపల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వసుల చంటి, గ్రామపటేళ్లు, మహిళలు, ఆదివాసీలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎగిరిపోయిన రేకులు



రోడ్డుపై విరిగిపడిన చెట్టు

గాలివాన బీభత్సం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు కాలులతో కూడిన వర్షం కురువడంతో చేతికివచ్చిన మొక్కజొన్న నేలకొరిగింది. మండలంలోని దనోరా(బి) గ్రామంలో ఇళ్లపై విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గాలికి ఇంటి పైకప్పు ఎగిరిపోయాయి. రోడ్డుకు అడ్డంగా చెట్లు విరిగిపడ్డాయి. అధికారులు నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.